క్లుప్తంగా

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు, నగదు అందజేస్తున్న సభ్యులు

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన చందనగిరి లక్ష్మయ్యకు గత ఆరు నెలల క్రితం కాలు తొలగించారు. దీంతో దివ్యాంగుడైన అతనికి ఆదివారం విజయవాడకు చెందిన కేబీపీ డెవలపర్స్, లక్సెట్టిపేటకు చెందిన శివసాయి గణేశ్ సేవాసమితి ఆధ్వర్యంలో రూ.6వేల ఆర్థిక సాయంతో పాటు, నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. మరో మూడు నెలల పాటు సరుకులు అందిస్తామని తెలిపారు. సేవా సమితి అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామమూర్తి, వినోద్‌శర్మ, పాలకుర్తి శ్రీనివాస్, పాటిబండ్ల శ్రీనివాస్, దండేపల్లి నటరత్న యూత్ అధ్యక్షుడు బొమ్మెన మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

జన్నారం: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో ఎంబీబీఎస్‌లో సీటు పొందిన జన్నారం మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులను వేర్వేరుగా కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కవ్వాల్ గ్రామానికి చెందిన తుడుం సుజాత –రమేశ్‌ల కూతురు సంజయిని, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్‌తో పాటుగా సురేందర్, రామకృష్ణ, గంగాధర్‌లు సన్మానించగా, బైరి లక్ష్మీనారాయణ–శకుంతల ల కుమార్తె స్నిగ్ధను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో, పులిశెట్టి భాగ్యలక్ష్మి –నగేశ్‌ల కూతురు అశ్రుతను మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

'బీసీ కులాలకు నష్టం కలగకుండా చూడాలి'



మాట్లాడుతున్న చంద్రయ్య, నాయకులు

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీ కులాలకు నష్టం కలగకుండా చూడాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొడూరి చంద్రయ్య కోరారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ కులాలకు న్యాయం జరగాలంటే ప్రభుత్వం పంపిన 42 శాతం బీసీ బిల్లుపై గవర్నర్, రాష్ట్రపతుల ఆమోదం తప్పనిసరన్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ కొండయ్య, బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి కోకన్వీనర్ కడార్ల నర్సయ్య, నాయకులు పురుషోత్తం, రాజన్న పాల్గొన్నారు.

కబడ్డీ విజేత 'లక్సెట్టిపేట'



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న నాయకులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బెస్తవాడలోని గంగామాత నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల విజేతగా లక్సెట్టిపేట జట్టు నిలిచింది. మొత్తం 32 జట్లు పాల్గొనగా మూడు రోజులు పోటీలు నిర్వహించారు. లక్సెట్టిపేట ప్రథమ విజేత లక్సెట్టిపేట జట్టుకు రూ.15వేలు, ద్వితీయ స్థానం బూరుగుపల్లికి రూ.7500 అందజేశారు. మాజీ సర్పంచ్ రాంచందర్, సాయి, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న మీసేవ నిర్వాహకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇటీవల మృతి చెందిన చెన్నూర్ మీసేవ నిర్వాహకుడు పుప్పాల సంతోష్‌కుమార్ కుటుంబానికి జిల్లా మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక చేయూత అందించారు. మీసేవ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.42,700ల నగదు సాయంగా అందించారు. మీ సేవ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొంపల్లి సతీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయం.. డ్రోన్ సాయం



నెన్నెల: వ్యవసాయంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు పొలం దున్నడం, విత్తనాలు వేయడం, కలుపు తీయడం, కోతలు కోయడం వంటి పనులన్నీ శారీరక శ్రమద్వారా జరిగేవి. ప్రస్తుతం వ్యవసాయంలో రైతులు ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను వాడుతున్నారు. ప్రస్తుతం కొంత మంది రైతులు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన రైతులు తమ వరి పొలాల్లో డ్రోన్ సాయంతో పురుగుల మందు పిచికారీ చేయించారు. డ్రోన్ వాడకంతో మందు వృథా కాదని, కూలీల కొరత అధిగమించవచ్చని, సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొంటున్నారు. ఎకరం పొలంలో మందు స్ప్రే చేయడానికి రూ.500 వరకు ఖర్చవుతుందని తెలిపారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



భీమిని: మండల కేంద్రంలోని రైతువేదిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న విద్యుత్ పోల్స్ పచ్చదనం అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. అటుగా వెళ్లే మూగజీవాలకు ప్రాణపాయం జరిగే అవకాశం ఉంది. విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏళ్లు గడిచినా మట్టి రోడ్డే!



చెన్నూర్‌రూరల్: మండలంలోని తుర్కపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి మాత్రం మారడం లేదు. ఏళ్లు గడుస్తున్నా మట్టి రోడ్డే దిక్కయ్యింది. ప్రస్తుతం వర్షాకాలంలో వర్షాలకు రోడ్డుపై బురద ఏర్పడి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా రోడ్డును మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పత్తి రైతు కుదేలు



పత్తి పైరు మీదనే మురిగిన కాయలు

- అధిక వర్షాలతో తీవ్ర నష్టం
- పూత రాలి, కాయ మురుగుతున్న వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

వేమనపల్లి: అధిక వర్షాలతో పత్తి రైతు కుదేలవుతున్నాడు. జూలైలో తక్కువ వర్షాలు పడి పత్తి పంట ఎదుగుదలపై ప్రభావం చూపగా తీరా కాత, పూత దశలో విస్తారంగా కురిసి నట్టేట ముంచుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.61 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువగానే వర్షం కురిసింది. ప్రారంభంలో అనుకూల వర్షాలు లేక పత్తి పైరు ఎదుగుదల తగ్గింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో పలు మండలాల్లో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది. గోదావరి, ప్రాణహిత తీర ప్రాంత మండలాల్లో పత్తి పంటలు వరదల పాలయ్యాయి. మిగిలిన పంటను కాపాడుకుందామంటే అధిక వర్షాలు వెంటాడుతున్నాయి. కురుస్తున్న వర్షాలతో పూత, గూడలో వర్షపు నీరు చేరి నేల రాలిపోతున్నాయి. దీనికితోడు చేలల్లో వర్షపు నీరు చేరి జాలు పడి పోతున్నాయి. పైరు పసుపు వర్ణంలోకి మారుతుంది. పైరుకు కాత, పూత నిలువక నేల రాలుతుంది. వర్షాలకు వేరు వ్యవస్థ కూడా దెబ్బతింటుండటంతో పైరు ఎదుగుదల లోపిస్తుందని రైతులు వాపోతున్నారు. వర్షాలతో పైరుకు మొదలు కాసిన కాయలు మురిగిపోతున్నాయి. ఇప్పటికే 80శాతం పత్తి పంటలో వ్యవసాయ, సస్యరక్షణ పనులు పూర్తయ్యాయి. కలుపు, దౌర, నేల బలం మందులు వేసుకున్నారు. సుమారు ఎకరాకు రూ. 30వేల – రూ.35వేల పెట్టుబడి పెట్టుకున్నారు. ఇంకో 40 రోజుల్లో పత్తి పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు పంటలను నష్టపరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వాతావరణం తేమగా ఉండటంతో గులాబి రంగు పురుగు, తెల్లదోమ, పచ్చదోమ తెగుళ్లు ఎక్కువవుతున్నాయి. చీడపీడల ప్రభావంతో కాత, పూత రాలుతుందని రైతులు పేర్కొంటున్నారు.

పూత, కాత లేదు



మా శివారులోనే ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట వేసిన. వానలెక్కువ పడి చెట్టు మీద ఉన్న కాత, పూత మొత్తం రాలిపోయింది. వర్షాలకు ఆకుమచ్చ, పండాకు తెగుళ్లు ఎక్కువవుతున్నాయి.

– సత్పతి పుల్లయ్య, వేమనపల్లి

అప్పు తెచ్చి పెట్టిన



వేమనపల్లిలో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసిన. అందిన కాడికి అప్పు చేసి దుకాణాల్లో ఉద్దెర పెట్టి మందులు తెచ్చిన. ఇప్పటి వరకు ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి దాటింది.

– తెల్గ ఆశయ్య, వేమనపల్లి

పల్లెల్లో గ్యాస్ ట్రబుల్!

- బుకింగ్ చేసిన వారం రోజులకు డెలివరీ
- ఒక్కో సిలిండర్‌పై అదనపు వసూళ్లు



వినియోగదారుడికి సిలిండర్ అందజేస్తున్న సిబ్బంది

వేమనపల్లి: మారుమూల గ్రామాల్లోని వంట గ్యాస్ వినియోగదారులను ఆయా గ్యాస్ ఏజెన్సీలు జలగల్లా పీల్చేస్తున్నాయి. దూర ప్రాంతాలకు చెందిన గ్యాస్ ఏజెన్సీలు మండలంలో అడ్డగోలుగా గ్యాస్ కనెక్షన్‌లు పెంచి వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. బెల్లంపల్లికి చెందిన అరవింద్ గ్యాస్ ఏజెన్సీ, స్నేహభారత్ గ్యాస్ ఏజెన్సీలకు మండలంలో సుమారు 4000 వరకు గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. మండలకేంద్రంలో ఉన్న వెంకటహనుమాన్ గ్యాస్ ఏజెన్సీకి 1896 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈక్రమంలో భారత్ గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే సిలిండర్ రావడానికి మూడు రోజుల నుంచి వారం రోజుల సమయం పడుతుందని వాపోతున్నారు. ఒక్కో సిలిండర్‌కు రూ.927ల చొప్పున వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లి నుంచి సిలిండర్లు తీసుకొస్తున్నామంటూ రూ.1050 నుంచి రూ.1070 వరకు తీసుకుంటున్నారు. ఒక్కో వినియోగదారుడి నుంచి అదనంగా రూ.123 నుంచి రూ.143ల వరకు వసూలు చేస్తున్నారు. దీనిపై వినియోగదారులు ఏజెన్సీ సిబ్బందిని నిలదీస్తే దిక్కున్న చోట చెప్పుకోండనే సమాధానం వస్తుందని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజకీయంగా, అధికారికంగా పలుకుబడి కలిగి ఉండడంతోనే ఫిర్యాదు చేసినా చర్యలు లేవని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

స్థానిక ఏజెన్సీలకు మార్చుకోవాలి

మండల పరిధిలో అందుబాటులో ఉన్న గ్యాస్ ఏజెన్సీకి వినియోగదారులు కనెక్షన్ మార్చుకోవాలి. దీని కోసం ప్రభుత్వం పోర్టబులిటీ సదుపాయం కూడా కల్పిస్తుంది. రెండు నెలల్లో జిల్లా వ్యాప్తంగా అమల్లోకి వస్తుంది. ఏజెన్సీకి 5 కి.మీ దూరం వరకు అదనపు ఖర్చు లేకుండా సిలిండర్ డోర్ డెలివరీ చేయాలి. బెల్లంపల్లికి చెందిన భారత్ గ్యాస్ ఏజెన్సీలు అదనంగా చేస్తున్న వసూళ్ల విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేపడుతాం.

– వేణుగోపాల్, డీసీఎస్‌వో



మంచిర్యాలరూరల్(హాజీపూర్): చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ వెంకటరాములు



మంచిర్యాలటౌన్: నివాళులర్పిస్తున్న అభిమానులు



బెల్లంపల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా కాకా జయంతి



చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

జిల్లాలో దివంగత మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి (కాకా) జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో, పట్టణాల్లో కాంగ్రెస్ నాయకులు, కాకా అభిమానులు, దళిత సంఘాల నాయకులు వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక మంత్రిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కాకా జయంతి పురస్కరించుకొని కొన్ని చోట్ల అన్నదానం నిర్వహించారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో జయంతి ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ పి.వెంకటరాములు ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు. బెల్లంపల్లిలో జరిగిన జయంతి కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సీహెచ్ శంకర్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు రొడ్డ శారద తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న థామస్ జాన్

పాతమంచిర్యాల: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ప్రొఫెషనల్ కొరియర్ నేషనల్ చైర్మన్ థామస్ జాన్ అన్నారు. ఆయన మొదటి సారిగా మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా స్థానిక ప్రొఫెషనల్ కొరియర్ యజమాని కే. సత్యపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో థామస్ జాన్ చేతుల మీదుగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో బాక్సింగ్ క్రీడాకారులకు బాక్సింగ్ కిట్లు అందజేశారు. అనంతరం హైటెక్ సిటీలోని మైత్రీ యోగా ప్రాంగణంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, ఆశ్రమం అభివృద్ధి కోసం రూ.25వేలు నగదు విరాళం అందజేశారు. ప్రొఫెషనల్ కొరియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జావీన్ జాన్ థామస్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ. మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాసిపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్ కుమార్‌లు అన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండలంలోని చిన్నధర్మారంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా పోటీచేసే అభ్యర్థుల జాబితా తయారు చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, విస్తృత ప్రచారంపై చర్చించినట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శులు దేవునూరి సంతోష్ కుమార్, రెడ్డి బాలరాజు, ఉపాధ్యక్షులు దోమల రాంచందర్, రాంటెంకి వినయ్, ముత్యాల నవీన్ కుమార్, నాయకులు గుంపుల సదయ్య, బానోత్ నాగరాజు, నైతం కృష్ణ తదితరులు ఉన్నారు.



జన్నారం మండలంలోని కామన్‌పల్లి, చర్లపల్లి, దేవునిగూడ గ్రామాల్లో బీటీ రోడ్లు చెడిపోయి గుంతలుగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వాటిలో నీరు చేరి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- జన్నారం

వాసవీక్లబ్ సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఆదివారం వాసవీక్లబ్ సమావేశం నిర్వహించారు. ఇందులో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు అట్టడుగు నిరుపేద వర్గాలకు వాసవీక్లబ్ అండగా నిలుస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, వాసవీక్లబ్ సభ్యులు మృతి చెందితే రూ. 25 వేల తక్షణ సాయం, చిరు వ్యాపారాలు చేసుకునే నిరుపేద వైశ్యులకు రూ. 25 వేల వడ్డీలేని రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపా రు. రీజియన్ చైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, ముక్తా శ్రీనివాస్, రేణిగుంట్ల శ్రీనివాస్, కటకం హరీ ష్, సిరిపురం రాజేశ్, ఎక్కిరాల శ్రీనివాస్, బా ల సంతోష్, కొండ చంద్రశేఖర్, క్యాబినెట్ అధి కారులు కొంకుముట్టి వెంకటేశ్వర్, బోనగిరి వే ణుగోపాల్, పుల్లూరి బాల్మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా గంగాదేవి, దుర్గామాత శోభాయాత్ర



దుర్గాదేవికి హారతి ఇస్తున్న భక్తులు



నృత్యం చేస్తున్న మహిళలు

వేమనపల్లి: మండలంలోని బెస్తవాడ గంగామాత, పద్మశాలీ వాడ దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్రతో వీధులు సందడిగా మారాయి. శోభాయాత్రలో పెద్దఎత్తున యువత, మహిళలు తరలివచ్చారు. డీజే చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అర్ధరాత్రి సమీపంలోని ప్రాణహిత నదిలో నిమజ్జనం చేశారు.

పడితే కానీ పట్టించుకోరా..!



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలోని హమాలీవాడలోని ఓ వీధిలో వంగిపోయిన ఓ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం కింది భాగంలో పగిలి లోపలి ఇనుప చువ్వలు బయటపడి నేలకూలే పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రక్షణ కంచె ఏర్పాటు చేయరూ..!

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రం హైటెక్‌సిటీ ఎదురుగా వడ్డెర కాలనీ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు గడ్డిని తినేందుకు పశువులు వస్తుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న పురాతన ఫీజు వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇన్సులేటర్ వైర్లు, ఎర్త్ వైర్లు తగిలి ఎక్కడ ఏ పశువు మృత్యువాత పడుతుందోనని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

దండేపల్లి: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం అందుకున్న మండలంలోని మామిడిపల్లికి చెందిన పోలంపల్లి రామరాజును దండేపల్లిలో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.